ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 31 అక్టోబరు 2025





ప్రకాశం బ్యారేజి వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

మొంథా పోయి.. వరద వచ్చె

మొంథా ధాటికి మూడు రోజులు జిల్లావాసులు వణికిపోయారు. తుఫాన్ తప్పింది.. ఎండ వచ్చింది.. అని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో వరద ముప్పు ముంచుకోస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణమ్మ పోటెత్తి ప్రవహిస్తోంది. నదిలో అంతకంతకూ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మళ్లీ నదీ తీరప్రాంతవాసులకు వరద ముప్పు తప్పడంలేదు. ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా నదీతీర ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతం వెంబడి గ్రామాల్లో అధికారులను అప్రమత్తంగా చేసింది. నిన్నటి వరకు తుఫాన్‌తో వరుణుడు ప్రకోపించి పెనుగాలులతో విరుచుకుపడితే, ఇప్పుడు కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతోందని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

- కృష్ణానదిలో పోటెత్తుతోన్న ప్రవాహం
- తుఫాన్ పోయిందని ఊపిరి పీల్చుకునే లోపే ముప్పు
- నదీ తీరప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 5.38 లక్షల క్యూసెక్కులు విడుదల

రేపల్లె, తెనాలి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గడచిన వారం రోజులుగా ఇటు జనం కానీ, అటు అధికారులు విరామం లేకుండా తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు శ్రమించారు. బుధవారం వాన విరామం తీసుకుంది. గురువారం ఎండ విరగకాసింది. ఇక వర్షాల నుంచి తేరుకోవచ్చని అటు రైతులు, ఇటు ముంపు ప్రాంతాల ప్రజలు ఊపరిపీల్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణానదికి వరద తరుముకొచ్చింది. నదిపై ఉన్న జలాశయాలకు ఎగువున కూడా వర్షాలు పడుతుండటం వరదకి కారణమైంది. మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు కురిసాయి. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో వరద నీరు మునేరు నుంచి కీసర ద్వారా ప్రకాశం బ్యారేజికి చేరుతోంది. అటు పల్నాడు జిల్లాలో కురిసిన వర్షాలకు అక్కడా వాగులు పొంగుతుండడంతో నదిలో వరద ప్రవాహం పెరిగింది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు, పులిచింతల నుంచి బ్యారేజికి వదులుతున్న నీటి స్థాయి కచ్చితంగా తెలుస్తున్నా, బ్యారేజి (మిగతా 6వ పేజీలో)

ప్రవాహం ఇలా..

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 4 క్రస్టుగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.
- పులిచింతల నుంచి గురువారం ఉదయం 6 గంటలకు 4.84 లక్షల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి వదిలారు. సాయంత్రానికి 1.51 లక్షల క్యూసెక్కులకి తగ్గించారు.
- కీసర వాగు, మునేరు నుంచి 1.49 లక్షలు, పాలేరు నుంచి 23,967 క్యూసెక్కుల వరద వచ్చి నదిలో చేరుతోంది.
- ప్రకాశం బ్యారేజి నుంచి 1.49 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. అది క్రమంగా పెరుగుతూ రావడంతో మధ్యాహ్నానికి 3.82 లక్షలకు, రాత్రికి 5,82,710 క్యూసెక్కులకు పెరిగింది. 69 గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

అపార నష్టం..
నిండా మునిగిన రైతులు



తుఫాన్ దెబ్బకు లంక గ్రామాల్లో దెబ్బతిన్న అరటి చేలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. తుఫాన్ బీభత్సం ఇంకా పొలాల్లో ముంపు రూపంలో కనిపిస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టి 24 గంటలు గడుస్తున్నా ఇంకా పొలాలు చెరువులనే తలపిస్తున్నాయి. నల్లమడ వాగులో వరద ప్రవాహంతో పలు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. దీంతో వేల ఎకరాల వరిపైరు మరింతగా ముంపు బారినపడింది. ప్రాథమిక అంచనాల ప్రకారమే జిల్లా వ్యాప్తంగా 82,500 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ తేల్చగా తుది నివేదికల్లో ఈ సంఖ్య మరింతగా పెరగనుంది. 66,000 ఎకరాల్లో వరి ముంపు బారిన పడింది. చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపించడానికి రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో దాదాపు 40,000 క్వింటాళ్ల పొగాకు దెబ్బతిన్నది.

24 పునరావాస కేంద్రాల కొనసాగింపు

మొత్తం 158 పునరావాస కేంద్రాల్లో 14,000 మంది వరకు తుఫాన్ బాధితులు తలదాచుకున్నారు. గురువారం నాటికి 24 కేంద్రాలు కొనసాగుతుండగా 1,400 మంది వరకు ఇంకా ఆశ్రయం పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 385 చెట్లు నేలకొరగగా అన్నింటినీ తొలగించారు. 116 కరెంటు స్తంభాలకు మరమ్మతలు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. ఈదురుగాలుల ధాటికి 33 హోర్డింగ్, ఫ్లెక్సీలు తెగిపడ్డాయి.



కారంచేడు కొమ్మమూరు కాల్వ వద్ద పడిన గండ్లను మంత్రులకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

మంత్రులు పార్థసారథి, రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో నష్టపోయిన వారు అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. పర్చూరు, కారంచేడు మండలాల్లో వారు గురువారం పర్యటించి రైతులను పరామర్శించారు. జాతీయ రహదారిపై టోల్ గేట్ వద్ద పర్చూరు వాగుకు గండిపడిన ప్రాంతాన్ని మంత్రులు పరిశీలించారు. వాగులు మూసేసినందునే వరద సంభవించిందని రైతుల ఫిర్యాదుతో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొమ్మమూరు కెనాల్ వద్ద గండ్లు పడిన ప్రాంతాన్ని, పర్చూరు వాగును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న నల్లబర్లీ పొగాకు పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబుముందస్తు అప్రమత్తతతో ఆస్తి ప్రాణనష్టం తప్పిందన్నారు. వాగులు పొంగడంతోనే అపారనష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, నియోజకవర్గ అధికారి ఉపకలెక్టర్ లవన్న పాల్గొన్నారు.

హెక్టారుకు రూ.25 వేల పరిహారం ?

- నష్టం అంచనాలకు అధికారులకు మంత్రి అనగాని ఆదేశాలు

రేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తున్నామని హెక్టార్‌కు రూ.25 వేల వరకు పరిహారం ఇచ్చే అవకాశం ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తుఫాన్ ప్రభావంపై అన్ని శాఖల అధికారులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ప్రభావితులైన వారికి సీఎం చంద్రబాబు భారీగా సహాయం ప్రకటించారన్నారు. మత్స్యకారులకు అదనపు సహాయం చేస్తున్నామని, గృహాలు దెబ్బతిన్న వారిని ఆదుకుంటామన్నారు. తుఫాన్ సమయంలో కూటమి పార్టీల నేతలంతా బూత్‌లెవల్ నుంచి రాష్ట్రస్థాయి వరకు సహాయ చర్యల్లో పాల్గొన్నారన్నారు. తుఫాన్ నష్టాలపై అంచనాలను శాఖల వారీగా అధికారులు సత్వరం రూపొందించాలన్నారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా పంట నష్టాలపై నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ఏఒక్క బాధితుడికి నష్టం జరగకూడదని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి అనగాని



అద్దంకి పట్టణం వ్యూ

మారనున్న జిల్లా స్వరూపం

- సరికొత్తగా ఏర్పాటు కానున్న డివిజన్లు
- డివిజన్‌గా అద్దంకి.. ఆపై ప్రకాశం జిల్లాలోకి..

(బాపట్ల, అద్దంకి, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం సమగ్ర పరిశీలన లేకుండా.. హడావిడిగా కొత్తగా ఏర్పాటు చేసిన బాపట్ల జిల్లా స్వరూపం ప్రస్తుతం మారనున్నది. పాలనా సౌలభ్యం, శాస్త్రీయ కసరత్తులకు ఆస్కారం లేకుండా గత ప్రభుత్వం జిల్లా ఏర్పాటు చేయగా వాటిని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాతో పాటు డివిజన్లు ఏర్పాటులో గతంలో అనేక అభ్యంతరాలు వచ్చినా నాటి పాలకులు పట్టించుకోలేదు. రాజకీయ సిఫారసులకు పెద్దపీట వేస్తూ ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకున్నారు. అయా తప్పులను సరిదిద్దే కార్యక్రమానికి ప్రస్తుత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని మండలాలన్నీ ఓ రెవెన్యూ డివిజన్ గొడుగు కిందకు తేవాలని తాజాగా ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం ఉన్న డివిజన్ల స్వరూపం మారనుంది. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు మండలాలు చీరాల డివిజన్ కింద, మార్టూరు, పర్చూరు, యద్దనపూడి మండలాలు బాపట్ల రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పర్చూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ కిందకు రానున్నాయి. అద్దంకి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో ఆ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలు ఆ డివిజన్‌లో భాగం కానున్నాయి. అప్పుడు చీరాల డివిజన్ 5 మండలాలకే పరిమితం కానుంది. పర్చూరు పరిధిలోని ఆరు మండలాలు బాపట్ల లేదా చీరాల డివిజన్‌లోనే పూర్తిగా భాగం కానున్నట్లు తెలుస్తోంది. అద్దంకిని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చడానికి కూడా ప్రభుత్వం సుముఖంగా ఉందనే సంకేతాలను నేతలు ఇప్పటికే ఇచ్చారు. అదే జరిగితే బాపట్ల జిల్లా 5 నియోజకవర్గాలకు పరిమితం కానున్నది.

నాటి హామీ అమలు దిశగా..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్నప్పుడు అద్దంకి నియోజకవర్గంలోని మండలాలు ఒంగోలు డివిజన్‌లో ఉండగా, జిల్లాల పునర్విభజనలో ఒంగోలు సమీపంలోని అద్దంకి నియోజకవర్గాన్ని చీరాల డివిజన్‌లో చేర్చారు. దీంతో జిల్లా, రెవెన్యూ డివిజన్‌లో పనులకు అద్దంకివాసులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు, పాదయాత్రలో లోకేశ్‌లు అద్దంకిని తిరిగి ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి మండలి ఉపసంఘం తీర్మానం మేరకు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు అద్దంకిని ప్రకాశం జిల్లా పరిధిలోకి మారేలా నిర్ణయం తీసుకున్నారు. జనవరికి అద్దంకి నియోజకవర్గ ప్రజల కల నెరవేరే అవకాశం ఉంది.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

హార్స్ రేసింగ్ క్లబ్‌లో చోరీ

● రూ.4.37 లక్షల నగదు మాయం

పెదకాకాని, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెదకాకాని రోడ్డులోని హార్స్ రేసింగ్ క్లబ్‌లో చోరీ ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం క్లబ్‌కు నిర్వాహకులు తాళాలు వేశారు. బుధవారం యథావిధిగా క్లబ్ తాళాలు తీసి.. ప్రారంభించారు. అయితే కౌంటర్‌లో ఉంచిన రూ.4.37లక్షల నగదు కనిపించ లేదు. సొత్తు చోరీకి గురైందని గ్రహించి.. అక్కడ పనిచేస్తున్న గూంటూరు మహిళ తుమ్మ నాగలత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

34,969 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 36,611 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 34,969 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,681 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	---	----	నెంబరు. 5	10000	14500
341	10000	15800	273	----	---
4884	----	----	341	10000	16000
సూపర్ 10	10000	14500	సూపర్ 10	11000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	7800

ఉధృతంగా నల్లమడ వాగు

● 42 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ● పరివాహక ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లమడడ్రైన్

బాపట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు కారణంగా.. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో నల్లమడవాగు ఉధృతి గంటగంటకు పెరిగిపోతోంది. బాపట్ల మండలం జిల్లెళ్లమూడి గ్రామం వద్ద మూలపాలెం రోడ్డు వైపు కట్టలు దాటుకొని వరదనీరు పొంగి పక్కనే ఉన్న పీటీ చానల్ గుండా పొలాల్లోకి వెళ్తోంది. దీంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. గురువారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ నల్లమడ వాగు వరద ఉధృతిని పరిశీలించారు. పరివాహక గ్రామాల్లో పర్యటించారు. అప్పికట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో వాగును సందర్శించి.. డ్రెయినేజీ అధికారులతో మాట్లాడారు. 42 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం నిలకడకగా ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లెళ్లమూడి గ్రామం దగ్గర నల్లమడ వంతెనను కలెక్టర్ పరిశీలించారు. పంట కాల్వ 13.3 కిలోమీటర్లు ప్రవహించి ఈస్ట్ తుంగభద్ర కెనాల్‌లో కలుస్తుందని ఇరిగేషన్ అధికారులు ఆయనకు వివరించారు. ఈస్ట్ తుంగభద్ర కాల్వ పరిధిలోని అన్ని స్లూయిస్‌లను తెరిచి నీటిని కాల్వల్లోకి మళ్లించాలని కలెక్టర్ వారికి సూచించారు. ఈ సమయంలో పొలాలు ముంపునకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వాగు బలహీన ప్రాంతాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లెళ్లమూడిలో వరద ప్రవాహాన్ని డ్రోన్ల ద్వారా కలెక్టర్ పరిశీలించారు. నీటి ఉధృతి ఎక్కువైతే గ్రామం ముంపునకు గురవుతుందని గ్రామస్థులందరని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తితో శిథిలావస్థలో ఉన్న నాలుగు లాక్‌ల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామంలోని శ్రీ విశ్వజననీ పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే మూలపాలెం గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడారు. గ్రామానికి ఎటువంటి ప్రమాదం లేదని నల్లమడ వాగు, పీటీ చానల్ నుంచి వరద ప్రవాహం వల్ల పంట పొలాలు నీట మునిగాయని వివరించారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత పంట నష్టం అంచనా వేసి పరిహారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి శివలీల, డ్రెయినేజీ డీఈ ధనలక్ష్మీ, తహసీల్దార్ షేక్.సలీమా, సర్వేయర్ లక్ష్మీ నారాయణ, ఇరిగేషన్ తదితరులున్నారు.

రైతులను కేంద్రం ఆదుకోవాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. ఇర్లపాడు, ఎండుగుంపాలెం, కోమటినేనివారిపాలెం గ్రామాల పరిధిలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. అవిశాయపాలెం పునరావాస కేంద్రంలో ఉన్న తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రైతులు మళ్లీ సాగు చేపట్టాలంటే పెట్టుబడిలో సగం కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో అందిస్తేనే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు కేంద్రాన్ని సంప్రదించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం హయాంలో వాగుల్లో పూడిక తీయక పోవడంతో వరద నీరు పొలాలు, జనావాసాలను ముంచెత్తిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వాగులు, కాలువల్లో పూడిక తీత పనులపై ప్రభుత్వం దృష్టి పెడితే భవిష్యత్తులో సమస్య ఉండదన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, జనసేన నేత రాజా రమేష్, తహసీల్దార్ కుటుంబరావు, సర్పంచ్ సామినేని లలిత నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.



ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

● దక్షిణ కోస్తా తుఫాన్ ప్రత్యేకాధికారి ఆర్పీ సిసోడియా

బాపట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది నుంచి భారీగా నీరు విడుదల అవుతున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర చేనేత జౌళీశాఖ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తా తుఫాన్ ప్రత్యేకాధికారి ఆర్పీ సిసోడియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కృష్ణానది వరద ప్రభావం వల్ల ముంపునకు గురయ్యే రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు సంబంధించి, నల్లమడ వాగు కింద వరద ముంపునకు గురయ్యే గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం అయ్యారు. కృష్ణానది ముంపుకు గురయ్యే మండలాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ముంపునకు గురయ్యే మండలాల అధికారులను అప్రమత్తం చేశామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ అబూత్ ఆలి తదితరులు పాల్గొన్నారు.



వరదనీటి ఉధృతి గురించి దక్షిణ కోస్తా తుఫాన్ ప్రత్యేకాధికారి ఆర్పీ సిసోడియాకు వివరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మొంథా పోయి.. వరద వచ్చే

(5వ పేజీ తరువాయి)

క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వచ్చి చేరుతోన్న వరద అంచనా లెక్కకు అందడంలేదు. దీంతో అధికారులు శుక్రవారానికి మరింతగా ఉధృతి పెరుగుతుందన్న అంచనాలో ఉన్నారు.

రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గర్లో

ప్రకాశం బ్యారేజికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 11 అడుగల మేర నీటి మట్టం కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నానికే వరద ప్రవాహ స్థాయి 3.9 లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. 5.67 లక్షలకు నీటి విడుదల స్థాయి పెరిగితే గురువారం రాత్రి 2వ ప్రమాద హెచ్చరిక అమల్లోకి వస్తుందనే అంచనాలో నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

లంక గ్రామాల్లో మళ్లీ భయం

లంక గ్రామాలు మరోసారి భయం గుప్పిట్లోకి చేరాయి. గత వరదలకు సంబంధించి ఏర్పడిన నష్టాల నుంచి తేరుకోక ముందే వరద భయం వెంటాడుతోంది. మిగిలిన పంటలు కూడా దక్కవనే ఆవేదనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాలను ఇప్పటికే రెండు దఫాలుగా వరదలు ముంచేశాయి. అరటి మినహా, పసుపు, కంద, మినుము, కూరగాయల సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాని చవిచూశారు. నిన్నటి తుఫాన్ పెనుగాలలకు అరటి చెట్లు కూడా కుదలయ్యారు. పసుపు, కంద వంటి దుంప పంట గత నష్టాలను తట్టుకుని కొద్దిగా అయినా దిగుబడిని రైతుకు దక్కనిస్తాయనుకుంటే వరద భయం మళ్లీ వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. నదిలో వరద ఉధృతి పెరగడంతో మంత్రి నాదెండ్ల మనోమర్ గురువారం రాత్రి కొల్లిపర మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. తుపాన్‌ను సమర్థంగా ఎదుర్కొన్నామని, వరద విషయంలోనూ భయపడాల్సిన పనిలేదని, దీనిని కూడా అధికమిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

24 మంది ప్రాణాలు కాపాడిన ఖాకీలు



తుఫాన్ సమయంలో పరిస్థితులను మంత్రులకు వివరిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : ఒక్కటే లక్ష్యం.. ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సరే జిల్లాలో ప్రాణనష్టం లేకుండా చేయడంపైనే దృష్టి.. దీనికి అనుగుణంగానే ఎస్పీ ఉమామహేశ్వర్ పక్కా వ్యూహంతో అడుగులేశారు. దాని ఫలితమే అంతటి తుఫాన్‌లోనూ ఎలాంటి ప్రాణనష్టం లేకుండా సక్సెస్ అయ్యారు. వివిధ ఘటనల్లో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బిక్కుబిక్కు మంటున్న 24 మందిని ప్రాణాపాయం తప్పించారు. మంగళవారం రాత్రి నుంచి మొంథా విరుచుకుపడుతున్నప్పటికీ పోలీసు యంత్రాంగం పక్కా వ్యూహంతో అడుగులు వేసింది. ప్రమాదంలో ఉన్న వారిని గుర్తించడంలో డ్రోన్ల సహాయం కూడా తీసు కున్నారు. తుఫాన్‌ను దీటుగా ఎదుర్కోవడంలో ప్రభుత్వ సన్నద్ధత, ఎస్పీ ఉమా మహేశ్వర్ వ్యూహం, క్షేత్రస్థాయిలోని సిబ్బంది కృషి కూడా తోడవడంతో పోలీసు విభాగం విజయం సాధించింది. మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపనుందనే హెచ్చరికలు వెలు వడిన వెంటనే అప్రమత్త మయ్యాం. ముందస్తు సన్నద్ధత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మంగళవారం రాత్రి అంతటి పెనుగాలుల సమయంలోనూ అర్ధరాత్రి 3 గంటల వరకు బయటే గడిపాం. అంతిమంగా ప్రాణనష్టం లేకుండా చేయడం సంతృప్తినిచ్చింది. పోలీసు సిబ్బందితో పాటు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ ఎఫ్ బలగాలు కూడా మాతో కలిసి పనిచేయడం వల్లే 21మంది ప్రాణాలు కాపాడగలిగాం.

కాల్వలో పడి వ్యక్తి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాలకృత్యాలు వెళ్లిన సమయంలో మూర్ఛకు గురైన వ్యక్తి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం వెల్లటూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ శివయ్య వివరాల మేరకు.. కొలుసు వెంకటేశ్వరరావు (39) కాలకృత్యాలు తీర్చుకునేందుకు మూడు కాల్వల పంట కాల్వ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



4 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటి మట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,739, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్‌ఫ్లో 66,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,49,139 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అర్ధంతరంగా విద్యుదుత్పత్తి నిలిపి వేత



నిండుగా వున్న రిజర్వాయర్

రెంటచింతల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 10 గంటల నుంచి భారీగా వరద రావడంతో(2 లక్షల 23 వేల క్యూసెక్కుల)వివిద్యుదుత్పత్తిని అర్ధంతరంగా నిలిపి వేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 5 గేట్లను 2మీటర్ల మేరఎత్తి 41,200, టేల్ రేస్ చానల్ ద్వారా 8,500 క్యూసెక్కులు మొత్తంగా 49700 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 49,000 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా 7.080 టీఎంసీలకు సమానమన్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు 0.9556 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి చేశా రు. ఇప్పటి వరకు 62.3535 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగింది.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం యూజీ, పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం విడుదల చేశారు. బీఏ, బీకాం, బీబీఏ తృతీయ సెమిస్టర్, ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసి.. వచ్చే నెల 12లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. యూజీ కోర్సులకు రూ.770, పీజీ కోర్సులకు రూ.960లు ఒక పేపర్‌కు ఫీజు చెల్లించాలన్నారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ డి.రామచంద్రన్, డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్ పాల్గొన్నారు.

సూర్యలంక తీరం దారి మూత



సూర్యలంక తీరం వద్ద ఉన్న గేటును మూసి వేసిన మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, అధికారులు,

బాపట్లరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాపట్ల సూర్యలంక సముద్ర తీరం దారిని అధికారులు గురువారం తాత్కాలికంగా మూసివేశారు. సముద్రంలో అలలు ఎగసి పడుతూనే ఉండడంతో.. కార్తీక మాసం లో తీరం వద్దకు భక్తులు, యాత్రికుల రాకపోకలను నిషేధించారు. అధికారులు అనుమతిస్తేనే రాకపోకలు పునరుద్ధరిస్తామని మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. భద్రత దృష్ట్యా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

అధికారులకు గ్లోరియానేట్ సోపాటి అభినందనలు



గ్లోరియానేట్ సోపాటి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ కారణంగా సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తుపాన్ సహాయక చర్యలు చేపట్టారని తెలుగుమహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి అన్నారు. ముందు ఆలోచనతో అంచనా వేసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మండల, గ్రామస్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అమలు చేసిన తీరు ఎంతో అభినందనీయమని అన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కలెక్టర్, ఎస్పీలు అధికారులకు సూచించిన తీరు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అన్నిశాఖలను అప్రమత్తం చేయటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

నీటి తొలగింపు పనులు



వర్షపునీటిని తొలగిస్తున్న పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్ తదితరులు

కర్లపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరలి పాతపాలెం తుపాన్ షెల్టర్ సమీపంలో వజ్రమ్మ గృహం వద్ద నిలిచిన వర్షపు నీటిని డీజిల్ ఇంజన్ ద్వారా తొలగిస్తున్న పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ షాకీర్ పాషాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరస్వామిరెడ్డి, సచివాలయ సిబ్బందిలు పాల్గొన్నారు.

పోలీసు పనితీరుపై అవగాహన

పిట్టలవానిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ నందు పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని చందోలు ఎస్‌ఐ మర్రి వెంకటశివకుమార్ నిర్వహించారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న రికార్డులు, స్టేషన్ సిబ్బంది పనితీరు గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్‌ఐ రాజ్యలక్ష్మీ, పోలీసుస్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటకాల్వకు గండి



కొండుభొట్లవారిపాలెంలో పంటకాల్వకు పడిన గండి

బాపట్లరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెంలో ఉన్న పంటకాల్వకట్ట వరద ఉధృతికి తెగిపోవటంతో సమీప వరి పొలాలు నీట మునిగాయి. గ్రామ సచివాలయం దగ్గర్లో ఉన్న ఈ కాల్వకు వరదలు వచ్చినప్పుడల్లా కట్టలు తెగిపోతున్నాయని రైతులు అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన మరమ్మతు పనులు చేపట్టడంలేదని రైతులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధితాధికారులు చర్యలు తీసుకొని ఈ పంటకాల్వకు మరమ్మత్తులు జరిపి పంటపొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మూగజీవాలను కాపాడిన అధికారులు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరద నీటి నుంచి మూగ జీవాలను రెవెన్యూ, పోలీసు అధికారులు కాపాడారు. గురువారం మండలపరిధిలోని ఈపూరు లంక గ్రామానికి చెందిన పౌలుకు చెందిన మూగజీవాలు చింతల్లంక పరిధిలోని కృష్ణానదిలో మేతకు వెళ్లాయి. కృష్ణానదికి ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీటిని విడుదల చేయడంతో జీవాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కౌలు రైతు సంఘం నాయకుడు తోడేటి సురేష్ రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలియజేయడంతో స్పందించిన నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ అమరవర్ధన్ గ్రామానికి చేరుకుని స్థానికులతో పాటు రెండు పడవల సాయంతో 90 జీవాలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

రిక్షా కార్మికుడికి ఆర్థికసాయం

బాపట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పటేల్‌నగర్‌కు చెందిన రిక్షా కార్మికుడు కత్తుల కోటయ్య గృహం తుపాన్‌కు కూలిపోయింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉండగా తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు సాదు నాగేశ్వరరావు స్పందించి ఆయనకు ఆర్థిక సాయంతోపాటు దుస్తులు, దుప్పటి అందజేశారు. పేద కుటుంబాల వారికి ప్రతిఒక్కరు తమ వంతు సాయం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

కాల్వలో అడ్డంకుల తొలగింపు



మురుగు కాల్వలో అడ్డంకులను యంత్రంతో తొలగించుకుంటున్న కౌలురైతులు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో నుంచి వర్షపునీరు వెళ్లకపోవడంతో మురుగు కాల్వలో అడ్డంకులను రైతులు, కౌలు రైతులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. గురువారం రావికంపాడు అడ్డరోడ్డు నుంచి మొసలిపాడు డ్రెయిన్ వరకు ఉన్న మురుగు కాల్వల్లోని పిచ్చిచెట్లు, ఇతర వ్యర్థాలు యంత్రం ద్వారా తొలగింపజేశారు. గంటకు రూ.1400 చొప్పున యంత్రానికి చెల్లించాలని సుమారు 8గంటలు పని చేసిందని రైతులు చెబుతున్నారు. పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

వరదలు, తుఫాన్లతో నష్టపోతున్న లంక గ్రామాల రైతులు

- ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది
- లంక గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే



పోతార్లంకలో నేలవాలిన అరటి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరదలు, తుఫాన్లతో లంక గ్రామాల రైతులు ఏటా నష్టపోతున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం కొల్లూరు మండలంలోని దోనేపూడి, పోతార్లంక, తిప్పలకట్ట, కిష్కిందపాలెం గ్రామాల్లో తుపాన్ తాకిడికి దెబ్బతిన్న అరటి, తమలపాకు, కంద పసుపు, కూరగాయ పంటలను ఎమ్మెల్యే పరిశీలించి రైతులను పరామర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ రావడంతో రైతులకు తీరని నష్టం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులందరిని ఆదుకుంటుందని, దెబ్బతిన్న పంటలను నష్టం అంచనాలు వేయించి త్వరగా ప్రభుత్వ పరిహారం అందేలాగా కృషి చేస్తానన్నారు. ఉద్యానశాఖ ఏడీతో దోనేపూడి సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో రైతుల పై ఉదాసీనతతో వ్యవహరించి పంట నష్టాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఘనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల మహేష్, సంగం డెయిరీ డైరెక్టర్ జీఏల్‌జీ భగవాన్, గృహలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అధినేత తుమాటి శ్యాంబాబు, సుంకర శ్రీను, కె.శివరామకృష్ణప్రసాద్, మోహనకృష్ణ, వై.శ్రీనివాసరావు, బి.తేజ, ఎస్‌మధు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన నాయకులు



జిల్లెళ్ళమూడిలో నల్లమడ కట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు ఫోన్‌లో సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రమాదకర స్థాయిలో పొంగి ప్రవహిస్తున్న నల్లమడవాగును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కూటమి శ్రేణులతో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లెళ్ళమూడి గ్రామం వద్ద కట్టలు తెగి పొంగి పిటీచానల్‌లోకి ప్రవహిస్తున్న నీటిని పరిశీలించిన ఆయన వెంటనే స్పందించి డ్రెయినేజి అధికారులతో మాట్లాడి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాన్ ప్రభావంతో పెద్దఎత్తున ఎగువ నుంచి వస్తున్న వరదనీటి వల్ల సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. దీనిని పూర్తి స్థాయిలో నివారించేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడుగు నాగేశ్వరరావు, ముక్కామల సాంబశివరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పార్టీశ్రేణులతో కలిసి నల్లమడ డ్రెయిన్‌ను పరిశీలించారు. పొంగిపొర్లుతున్న వాగు ఉధృతి వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను అడిగి సమస్య గురించి తెలుసుకున్నారు. జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితరులు నల్లమడ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు.

పెనుమూడిలో వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్



పెనుమూడిలో కృష్ణానది వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుమూడి పుష్కర్ ఘాట్ వద్ద కృష్ణా నది వరద ఉధృతిని కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణా రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైనని అన్నారు. ఎగువ నుంచి వరద నీటిని దిగువ ప్రాంతాలకు వదులుతున్న నేపథ్యంలో కృష్ణానదిలో వరద ప్రవాహం ఎక్కువైందని తెలిపారు. దీని కారణంగా ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం కృష్ణానదిలో 5 లక్షల 67 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుందని చెప్పారు. ఈ రాత్రికి ఇంకా వరద పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, వేటకు వెళ్లిన వారు వెంటనే వెనక్కు రావాలన్నారు. పుష్కర ఘాట్‌కు ఆనుకుని ఉన్న పల్లెపాలెం ప్రజలకు పునరావాస కేంద్రానికి తరలివెళ్లాలని సూచించారు. పునరావాసానికి వెళ్లే మత్స్యకారులకు 50 కేజీలు బియ్యం అందజేస్తారన్నారు. పనిలోకి వెళ్లని వారికి రూ.1000 నుంచి రూ.3000 వరకు ప్రభుత్వ సాయం అందజేస్తుందని తెలిపారు. ప్రజలందరూ శుక్రవారం అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద కారణంగా ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రెపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ రిజర్వ్ కన్జర్వేటర్ నాగేశ్వర నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పంటల నష్టపరిహారం పెంచి రైతులను ఆదుకోవాలి

- సీపీఎం, సీపీఐ నాయకులు



నేలవాలిన అరటి తోటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భట్టిప్రోలు(కొల్లూరు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాన్ కారణంగా వాణిజ్య పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పెంపుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలు మండలంలోని లంక గ్రామాల్లో సీపీఎం బృందం పర్యటించింది. తుపాన్ వల్ల దెబ్బతిన్న అరటి తదితర పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జి.సుధాకర్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, గత సంవత్సరం కృష్ణానది వరదల వల్ల రైతులు వాణిజ్య పంటలు కోల్పోతే ప్రస్తుతం మొంథా తుపాన్ ప్రభావానికి రైతులు, కౌలు రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారన్నారు. అరటి పంటకు పరిహారం రూ. 30 వేలు, వరి, మినుము పంటలకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల నుంచి ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోతున్న రైతులకు రుణాలకు వడ్డీ మాఫీ చేయాలని, పాత బకాయిలను కూడా మాఫీ చేయాలని కోరారు. పంటల పరిశీలనలో సీపీఎం మండల కన్వీనర్ మనోజ్‌కుమార్, నాయకులు మురుగుడు సత్యనారాయణ, రైతులు శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల పరిశీలన

మండల పరిధిలోని చిలుమూరులంక తదితర గ్రామాల్లో సీపీఐ బృందం పర్యటించింది. గాలులకు విరిగిపడ్డ అరటి తోటలను పరిశీలించి రైతులు, కౌలు రైతులతో నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నష్టం అంచనాలు వేసి కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు పరిహారం పెంపు చేసి అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, కౌలు రైతులు జంపని వెంకటప్రసాద్, గుమ్మడి యోబు, నవీన్, తోడేటి అశోక్, నాగబాబు, పాములు తదితరులు పాల్గొన్నారు.

పంటనష్ట పోకుండా జాగ్రత్తలు తీసుకోండి : శాస్త్రవేత్తల బృందం

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్, వరద కారణంగా నీటమునిగిన పొలాలల్లో పంటను రక్షించుకోవటానికి తగుజాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారుల బృందం తెలిపింది. గురువారం ఏడిఏ కె.ధనరాజు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.కామాక్షి, డాక్టర్ డి.సంపత్‌కుమార్, డాక్టర్ డి.కృష్ణవేణి, డి.సందీప్‌రాజా బృందం జిల్లెళ్ళమూడి, మూలపాలెం గ్రామాల్లో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో నీరు తీసివేసి 20కిలోల యూరియా 10కిలోల పోటాష్ బూస్టర్‌డోస్‌గా వేయాలన్నారు. పొలం ఆరాక కార్బండిజం 300గ్రాములు లేదా ప్రొపీ కొనజోల్ 200మిల్లీలీటర్లు చొప్పున ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు. వేరుశనగ పంట 60 రోజుల దశ నుండి కోతకోయటకు సిద్ధంగా ఉన్నా దశ వరకు నీరు తీసేసి సాప్ మందు 400గ్రాములు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.శారద తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప వ్యవధిలోనే విద్యుత్ పునరుద్ధరణ



కావూరు వద్ద విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

చెరుకుపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో మండలవ్యాప్తంగా 18 చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారుల ముందుచూపుతో గంటల వ్యవధిలోనే విద్యుత్ పునరుద్ధరణ సాధ్యమైంది. తుపాన్ తీరం దాటే సమయంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సాధారణ పరిస్థితి తిరిగి నెలకొనగా అధికారులు ఉదయం నుంచే పనులకు ఉపక్రమించారు. నేలవాలిన స్తంభాల జాబితాను సిద్ధంచేసి ప్రత్యేక బృందాల ద్వారా సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపించారు. చెరుకుపల్లికి ఉదయం 11గంటలకే విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. మిగిలిన గ్రామీణ ప్రాంతాలు సాయంత్రం 6 గంటల కల్లా విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు చూపిన చొరవ అభినందనీయమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తునాన్నారు. ఉన్న సిబ్బందికి తోడు అదనంగా బయటి నుంచి మరో 15 మంది సిబ్బందిని రప్పించినట్లు ఏఈ పోతురాజు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందుగానే ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహించి త్వరగా విద్యుత్ సరఫరా అందించామని తెలిపారు.

సచివాలయ సిబ్బంది సేవలు అభినందనీయం



పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీవర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ తుపాన్‌ని ఎదుర్కొన్న సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు అభినందించారు. గురువారం మండలంలోని వివిధ పంచాయతీల్లో ప్రజలకు ఎటువంటి ఆటంకం కలగకుండా సచివాలయ సిబ్బంది తమ విధులు నిర్వహించారని అన్నారు. ముఖ్యంగా రహదార్లపై విరిగిపోయిన వృక్షాలను పక్కకు తొలగించడం, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని మోటార్ల సహాయంతో బయటకు పంపించటం, కరెంట్ హెల్పర్ల సహాయంతో తెగిపడిన వైర్లను వెంటనే సరిచేయడం, ట్యాంకర్ల సహాయంతో తాగునీటిని అందించడం చేశారని తెలిపారు. మండలంలోని ప్రజలకు తుపాన్ ప్రభావంతో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీతాడిచెట్టు పోలేరమ్మని దర్శించుకున్న కోన



పోలేరమ్మ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలవారిపాలెం గ్రామంలో కొలువైయున్న శ్రీతాడిచెట్టు పోలేరమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి గురువారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడుఏడుకొండలు, ఉప ఎంపీపీ సుబ్బారావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'సూపర్ శానిటేషన్'



కుచ్చెళ్లపాడులో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు



వేమూరులో కాల్వల్లో పూడికతీతను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలపరిధి గ్రామాల్లో సూపర్ శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్ పర్యవేక్షణలో పంచాయతీల కార్యదర్శులు, కార్మికుల ద్వారా కాల్వల్లో పూడికలు తీయించారు. చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. నీటి కుళాయిల వద్ద, పల్లపు ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో నిలిచిన నీటిని తొలగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిర్మల మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి నిల్వ ఉన్న నీటిని బయటకు పంపి మంచినీటితో నింపించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను కొనసాగిస్తున్నారు.

ప్రజలకు పోలీసుశాఖకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే లక్ష్యం

- ఎస్పీ ఉమామహేశ్వర్
- ఓపెన్ హౌస్ ప్రారంభం



ఓపెన్ హౌస్‌లో పోలీసులు వినియోగించే వివిధ పరికరాలు, తుపాకులు, జాగిలాలు గురించి వివరిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, పోలీసుశాఖకు మధ్య సత్సంబంధాలు పెంపొందించటమే లక్ష్యమని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి పోలీసులు విధినిర్వహణలో వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాంకేతిక ఉపకరణాల గురించి ఎస్పీ విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21 నుంచి 31వ తేది వరకు నిర్వహించే స్మారక ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించటానికి జిల్లాలోని అనేక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తారన్నారు. దీనికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసుసిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ప్రజలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఎస్‌బిసిఐ జి.నారాయణ, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ అహ్మద్ జానీ, మహిళా పోలీసుస్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు, ఇంకొల్లు సీఐ రమణయ్య, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్ తదితర పోలీసుఅధికారులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి శక్తి స్వరూపుడు

- రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

నగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భయాన్ని పోగొట్టే భగవంతుడిగా హనుమంతుడిని కొలవటం ఆనవాయితీగా వస్తుందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం గౌడపాలెంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి శక్తి స్వరూపుడని పిలుస్తారని అపారమైన బలం, ధైర్యం శౌర్యానికి ప్రతీకగా భక్తులకు జీవితంలో అన్నికష్టాలు ఎదుర్కొవడానికి శక్తి బలాన్ని ప్రసాదిస్తాడని అపారమైన నమ్మకమని ఆయన అన్నారు. కులమతాలకు అతీతంగా హనుమంతుడిని పూజించడం ఆనవాయితీగా వస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం ఆంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన తర్వాత ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరం మండల అధ్యక్షుడు చింతలసుబ్బారావు, సీనియర్ నాయకులు లుక్కా గుడారం కయ్య, శ్రీకాంత్, చింతారావు, తదితరులు పాల్గొన్నారు.



చిలుమూరులంకలో గ్రామస్థులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావన

వరదతో అప్రమత్తంగా ఉండాలి

- జాయింట్ కలెక్టర్ భావన

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరదతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు. గురువారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో జేసీ పర్యటించారు. చిలుమూరు లంక వెళ్లి అక్కడ గ్రామస్థులతో మాట్లాడారు. వరద పెరిగితే పునరావాస కేంద్రాలకు రావాలని కోరగా గ్రామస్తులు, సర్పంచ్ ఎంత వరద వచ్చిన ఇళ్లు, పశువులు వీడి రాలేమని తెలుపగా, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని జేసీ తహసీల్దార్‌కు సూచించారు. అరవింద వారధి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించి అక్కడ ఉన్న గండి గురించి తహసీల్దార్, ఆర్‌సీ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గాజుల్లంకలో మత్స్యకారులతో మాట్లాడారు. వారికి నిత్యావసరాలు, 50 కేజీల బియ్యం, ఇతరులకు సాధారణ రేషన్ అందించాలని సూచించారు. తుపాన్ తీవ్రతకు తమ బోట్లు 80 వరకు దెబ్బతిన్నాయని జేసీ దృష్టికి తీసుకువెళ్లగా మత్స్యశాఖ అధికారితో మాట్లాడారు. జేసీ వెంట డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, ఎంపీడీవో, ఎస్‌ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో తనిఖీ



ఆయుష్మాన్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు లోకేశ్, లక్ష్మణ్, రవికుమార్ తదితరులు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని డీహెచ్‌హెచ్‌వో జిల్లా అధికారులు తనిఖీ చేశారు. గురువారం మండలపరిధిలోని క్రాప గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పీఎంజేఏవై, పీఎంటీబీవై వైద్యసేవలు గురించి ఆరా తీశారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులతో పాటు విష జ్వరాలు గురించి ప్రతిరోజు ఫీవర్ సర్వే చేయాలని సర్వేను యాప్‌లో పొందుపరచాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో విజయమ్మ ఆదేశాల మేరకు డీహెచ్‌హెచ్‌వో అధికారులు లోకేశ్, లక్ష్మణ్, రవికుమార్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొల్లూరు పీహెచ్‌సీ వైద్యులు పి.వెంకటసాయి, సీహెచ్‌వో విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, వై.హరిబాబు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పడిపోయిన పైరును కాపాడేందుకు చర్యలు



వరి పొలంలో వర్షపు నీటిని బయటకు పంపేందుకు జాలు చేస్తున్న రైతులు

వేమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో పడిపోయిన వరి పైరును కాపాడుకునేందుకు రైతులు అనేక తీసుకుంటున్నారు. పొలంలో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు ఎక్కడికక్కడ జాలు చేసి కాల్వలోకి వదులుతున్నారు. పడిన పైరును పైకి లేపి కట్టలుగా కట్టి నిలబెడుతున్నారు. వివిధ దశల్లో ఉన్న పైరు పడిపోవడం వల్ల ప్రతి రైతు నష్టాన్ని చవిచూసే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు లక్ష్మి మండల వ్యవసాయశాఖ అధికారి ప్రేమ్‌సాగర్ 17 గ్రామాల పరిధిలోని ఏడీఏ ఆయా గ్రామాల్లో క్షేత్రాల వద్దకు వెళ్లి పంటను కాపాడుకునే విధానాన్ని తెలిపి నీరు బయటకు వెళ్లకుండా ఉన్న ప్రాంతంలో తక్షణం ఉప్పు నీటిని పిచికారీ చేయాలని సూచిస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న తహసీల్దార్ వాహనం

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని తహసీల్దార్ వాహనం ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన సంఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకుపల్లి మండల తహసీల్దార్ పద్మావతి పని నిమిత్తం తన వాహనంలో రేపల్లె వెళుతుండగా మండలపరిధిలోని అద్దేపల్లి సర్వీసు రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన ఆరాధ్యుల సుబ్రహ్మణ్యం కాలికి తీవ్ర గాయమైంది. వెనుక ఉన్న మరో వ్యక్తి మధు సురక్షితంగా బయటపడ్డాడు. జరిగిన ప్రమాదాన్ని తహసీల్దార్ పద్మావతి భట్టిప్రోలు పోలీసులకు తెలియపరిచి కార్యాలయ పనుల నిమిత్తం రేపల్లె వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్ చైతన్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శివయ్య తెలిపారు.

తిట్టి బెదిరించారంటూ ఫిర్యాదు

బాపట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేవుడి మాన్యంకు చెందిన శ్రీవాసవి అనే మహిళ పిల్లలు ఆడుకుంటుండగా బాప గోపమ్మ కుటుంబ సభ్యులతో కలిసి తిట్టి బెదిరించారంటూ పట్టణ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రావతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంటలకు ప్రాణం పోద్దాం

- నీట మునిగిన పంటలను సంరక్షించుకోవాలి
- సస్యరక్షణతో దిగుబడులు చేతికి.. నష్ట నివారణ
- ఏడీఏ నాగభైరు మోహన్‌రావు



మేడికొండూరు మండలంలో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నాగభైరు మోహన్ రావు

గుంటూరు సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని రైతులు మొంథా తుపాను తర్వాత చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలను తుపాను ప్రభావిత మండలాలకు తీసుకువెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు ఏడీఏ నాగభైరు మోహన్‌రావు శాస్త్రవేత్తలతో కలిసి పలు మండలాల్లో పర్యటించారు. పంటలు ముంపునకు గురైన రైతులు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సూచనలు పాటిస్తే పంటలకు తిరిగి ప్రాణం పోయవచ్చని ఏడీఏ తెలిపారు.

పంట ముంపు అనంతర సూచనలు

పత్తి

90 రోజుల పంటలో (పూత, కాయ ఏర్పడి, వృద్ధి చెందే దశ)చాళ్ల ఏర్పాటు చేసి మొక్కలో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. యూరియా లేదా పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ని ఒక శాతం మెగ్నిషియం సల్ఫేట్‌తో పాటుగా రెండు సార్లు 7 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. 5 గ్రాములు/లీ బోరాక్స్ 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

కాయ కుళ్లని తగ్గించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) + 0.1 గ్రాములు స్ట్రెప్టోసైక్లిన్/లీటరు మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యగా 3 గ్రాములు లీటరు నీటికి మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రేసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4. 5% నాప్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. 20 నుంచి 22 కణుపుల ఎత్తులో ప్రధాన కాండపు తల తుంచడం పాటించాలి.

120 రోజుల పంట (కాయ పెరిగి పగిలే దశ)

పంటలో చాళ్ల ఏర్పాటు చేసి మొక్కల్లో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. వర్షాలు తగ్గిన పొడి వాతావరణంలో పత్తి తీతను చేయాలి. తేమ ఎక్కువగా ఉంటే, నీడలో ఆరబెట్టాలి.

5 గ్రా./లీ బోరాక్స్ 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

కాయ కుళ్లని తగ్గించడానికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) + 0.1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ / లీ. మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిచేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ఉండడానికి ముందస్తు చర్యగా 3 గ్రా./లీ. మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రేసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./ లీ. మోతాదులో పిచికారీ చేయాలి.

గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5% నాప్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. 20 నుంచి 22 కణుపుల ఎత్తులో ప్రధాన కాండపు తల తుంచడం పాటించాలి.

వేరుశనగ

పంట పక్వ దశలో ఉంటే వర్షాలు తగ్గే వరకు పైరు పెరకడం, తీయడం చేయ కూడదు. పెరికిన పైరును కుప్పలుగా వేస్తే.. కాయలు మొలకలు వస్తాయి. పైరు వాదెలుగా ఉంచి పొలాల్లో నీరు చేరని ప్రదేశంలో ఆరబెట్టి ఉంచాలి. పొలంలో మురుగు నీరు తొలగించాలి. అక్టోబరు మొదటి వారంలో విత్తిన పైరుకు మొదలు కుళ్లు, ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. నివారణకు వర్షం తగ్గిన వెంటనే మాంకోజెబ్ 2.5 గ్రాములు + కార్బండజిమ్ 12 శాతం లేదా హెక్సాకోనజోల్ 2.0 మీ.లీటర్లు లీటరు నీటిలో కలిపి మొక్కలు బాగా తడిచేలా పిచికారి చేయాలి. విత్తుకు ముందు కిలో విత్తనానికి కార్బాక్సిన్(37.5శాతం) + థైరామ్ (37.5శాతం) 3గ్రాములు లేదా మాంకోజబ్ + కార్బండజిమ్ 25 శాతం 2 గ్రాములు లేదా పెంఫ్లూఫెన్ 13.28 + ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్ 13.28 (2 మీ.లీ+ 4 మీ.లీ నీరు) కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేత పైరుకు పొగాకు లద్దె పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 5% 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మినుము, పెసర

మినుము, పెసర పంటలు మొలక దశ నుంచి శాఖీయ, పూత నుంచి కాయ కోత దశలలో ఉన్నాయి. మొలక దశ నుంచి శాఖీయ దశలో ఉన్న పంట ముంపునకు గురైన పొలాల్లో మురుగు నీరు వీలైనంత త్వరగా తొలగించాలి. ఇనుపధాతు లోపం కనిపించే అవకాశం ఉంది కావున.. నివారణకు అన్నబేది 50 గ్రాములు + నిమ్మ ఉప్పు 5 గ్రాములు+ యూరియా 100 నుంచి 150 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. దీంతో పంట సమర్థంగా కోలుకోవడానికి దోహదపడుతుంది. వారం తర్వాత ఒక శాతం 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్లు రాకుండా హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ పిచికారి చేయాలి.

పూత నుంచి కాయ దశ

ముంపునకు గురైన పొలాల్లో మురుగు నీరు వీలైనంత త్వరగా తొలగించాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్‌ను పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. దీనికి క్లోరిఫైరిఫాస్ 20 ఇ.సి లేక నోవాల్యురాన్ 10 ఇ.సి ఏదో ఒక మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న


పొలాల్లో నిల్వ నీటిని 48 గంటల్లోగా తొలగించాలి. పొలం ఎండిన తర్వాత ఒక శాతం యూరియా, 0.5శాతం జింక్ సల్ఫేట్ కలిపి ఆకులపై పిచికారీ చేయాలి. కోతకు వచ్చిన మొక్కజొన్న పొత్తులను తక్షణం కోసి, వాటిని 13శాతం తేమ స్థాయికి ఆరబెట్టడం ద్వారా మొలకెత్తడం, నాణ్యత తగ్గుదలను నివారించవచ్చు. తేమ సాగుతున్న ప్రాంతాల్లో మొక్కజొన్న పంటపై ఫంగస్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రొపికొనజోల్ (0.1శాతం) వంటి తగిన ఫంగిసైడ్‌ను పిచికారి చేయాలి.

కంది..

ప్రస్తుతం కంది పంట మొలక దశ నుంచి పూతకు వస్తోంది. ఇనుపధాతు లోపం నివారణకు.. అన్న బేది 50 గ్రాములు + నిమ్మ ఉప్పు 5 గ్రాములు + యూరియా 100 నుంచి 150 గ్రాములను 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.

పంట కోలుకోవడానికి 19: 19: 19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే.. కాపెర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి వేర్లు తడిచేట్లు మొదళ్లలో పోయాలి. పంట పూత దశలో ఉన్నట్లయితే మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. దీనికి క్లోరిఫైరిఫాస్ 20 ఇ.సి లేక నోవాల్యురాన్ 10 ఇ.సి లేదా స్పైనోసాడ ఏదో ఒక మందును పిచికారి చేయాలి.

వాణిజ్యం.. విలవిల



తుఫాన్ ధాటికి విరిగిపడ్డ అరటి చెట్లు

● కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు దెబ్బతిన్న వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోతున్నాయి. మండలంలోని చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతలంక, పెదలంక, పోతార్లంక, కిష్కిందపాలెం తదితర లంక గ్రామాల్లో రైతులు అరటి, బొప్పాయి, తమలపాకు, కంద, పసుపు తదిర వాణిజ్య పంటలతో పాటు మినుము, కూరగాయ పంటలను సాగు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం తుఫాన్ తీరం దాటే సమయంలో బలంగా వీచిన గాలులకు అరటి, బొప్పాయి, తమలపాకు, పసుపు, కంద, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పోతార్లంక సమీపంలో పలుచోట్ల అరటి తోటలు గాలి తీవ్రతకు కూకటివేళ్లతో సహా విరిగిపడ్డాయి. వర్షం, గాలుల తీవ్రతకు కంద, పసుపు, బొప్పాయి పంటలు కూడా దెబ్బతినగా వర్షపు నీటిలో ఉన్న పసుపు కుళ్లిపోతోంది. కంద పైరు చెట్లు విరిగిపోవడం దుంప ఉరే పరిస్థితి లేకుండా పోయింది. బొప్పాయి చెట్లు విరిగిపోవడంతో పాటు కాయలు పూర్తిగా రాలిపోయాయి. చింతల్లంక వద్ద సాగులో ఉన్న దొండ, కాకర పందిళ్లు కుప్పకూలిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు తుఫాన్ తాకిడికి గురై కళ్ల ముందు జీవం కోల్పోతుంటే అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం అరకొర అందించే సాయానికి తాము నష్టపోయిన దానికి పొంతన లేకుండా ఉంటోందని.. పరిహారం పెంచి అందిస్తే కొంత వరకు కోలుకునే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



కుళ్లిపోతున్న పసుపు పైరు



గాలులకు పడిపోయిన కందపైరు



ఈదురుగాలులకు పడిపోయిన కాకర పందిళ్లు

కొండవీటి వాగు రివర్స్ ఫ్లో

- రెగ్యులేటర్ దెబ్బతినడంతో ఎదురెళ్తున్న వరద
- లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడుతున్న యంత్రాంగం

విజయవాడ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోని వరద నీటిని కృష్ణా నదిలోకి చేరవేసే కొండవీడు వాగు రెగ్యులేటర్ ప్రమాదస్థాయికి చేరింది. నదిలో పెరిగిన వరద నీరు దెబ్బతిన్న రెగ్యులేటర్ గేట్ల ద్వారా తిరిగి వాగులోకి చేరుతోంది. రాజధాని ప్రాంతంలోని లాం గ్రామం నుంచి కొండవీడు వాగు ప్రారంభమై పెదపరిమి, నీరుకొండ, కృష్ణాయ పాలెం, పెనుమాక, తుళ్లూరు, వెలగపూడి మీదుగా కృష్ణానదిలోకి చేరుతుంది. 30 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ వాగులోకి కొట్టెళ్ల వాగు, పాలవాగు, ఎర్రవాగులు సైతం కలుస్తాయి. ఆయా ప్రాంతా లు ముంపుబారిన పడకుండా ఈ వాగులే రక్షణగా ఉంటాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి ఆయా ప్రాంతాల్లోని సాగు భూముల్లోకి భారీగా నీరు చేరింది. ఆ నీటిని అంతా కొండవీడు వాగు మాత్రమే కృష్ణా నదిలోకి చేరవేయాల్సి ఉంటుంది. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉంటే కృష్ణానది వద్ద కట్టిన రెగ్యులేటర్ నుంచి ఈ నీరు గ్రావిటీ ద్వారా నదిలో కలుస్తుంది. నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్న సందర్భాల్లో రెగ్యులేటర్ గేట్లను దించేసి, పక్కనే ఉన్న లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడతారు.



కొండవీటి వాగు వద్ద వరద ఉధృతి

నదిలో నీళ్లు నదిలోకే..

దాదాపు 30 ఏళ్ల కిందట కట్టిన రెగ్యులేటర్ గేట్లు అన్నీ దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా అమరావతి నుంచి వస్తున్న వరదతో కొండవీడు వాగు నిండుకుండలా మారింది. మరోవైపు కృష్ణానది సైతం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో నిండిపోయింది. గురువారం నదిలో నీటిమట్టం ఊహించని రీతిలో 15 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో నది నుంచి 5.66 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. రెగ్యులేటర్ గేట్లు ఐదు పూర్తిగా, మిగిలినవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటి నుంచి ప్రతి గంటకూ సుమారు 700 క్యూసెక్కుల నీరు కొండవీడు వాగులోకి చేరుతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇదే నీటని లిఫ్ట్ మూడు పంపులు ద్వారా తిరిగి కృష్ణానదిలోకి తోడుతున్నారు. ప్రతి గంటకు 1,059 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ ద్వారా నదిలోకి చేరవేస్తున్నారు. దీనిలో అమరావతి గ్రామాల నుంచి వచ్చే నీరు సుమారు 350 క్యూసెక్కులు, కృష్ణానది నుంచి వాగులోకి వచ్చే నీరు గంటకు 700 తోడాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతం నుంచి వాగు నీటిని బకింగ్‌హామ్ కాల్వలోకి రెండు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి వదులుతున్నారు.

10 వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లకు నోటీసులు


● అసత్య కథనాల కట్టడికి పోలీసుశాఖ చర్యలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాల కట్టడికి పోలీస్ శాఖ నడుం బిగించింది. వాట్సాప్ గ్రూపుల్లో పోలీసు అధికారులను, సిబ్బందిని సభ్యులుగా చేర్చుకుని కథనాలు పోస్టు చేస్తూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో.. పోలీస్ శాఖ చర్యలకు సిద్ధమైంది. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు సృష్టించి పోస్ట్ చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసినా అందుకు గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా 15 వాట్సాప్ గ్రూపులను గుర్తించారు. ముందుగా 10 క్రైమ్ గ్రూపుల అడ్మిన్ లకు నోటీసులు ఇవ్వాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. వారు నివాసం ఉండే పరిధిలోని పోలీస్ స్టేషన్ల నుంచి వారికి పిలుపు వచ్చింది. స్టేషన్‌కు వచ్చి నోటీసులు తీసుకోవాలని సూచించారు. నగరంలోని లాలాపేట స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు గ్రూప్‌ల అడ్మిన్‌లకు నోటీసులు సిద్ధం చేసి.. వాటిని తీసుకోవాలని ఫోన్‌లు చేసి చెప్పారు. అలాగే అరండల్ పేట, నగరంపాలెం, పెదకాకానితో పాటు పొన్నూరు టౌన్‌కు చెందిన అడ్మిన్‌లు ఉన్నారు. అలాగే మరో రెండు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల అడ్మిన్‌లు కూడా ఉన్నారు. వారికి కూడా నోటీసులు ఇవ్వనున్నారు. రెండో దఫా కూడా మరికొన్ని గ్రూపులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. అలాగే యూ ట్యూబ్ చానళ్ల పేరుతో.. పోలీసులను, వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న ఘటనలపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. కొందరు ఏకంగా జిల్లా పోలీస్ కార్యాలయానికే వచ్చి బాధితులను డబ్బు డిమాండ్ చేస్తున్న విషయం కూడా పోలీసు అధికారుల దృష్టికి వచ్చింది.

రైల్వేపై మొంథా ఎఫెక్ట్

- చీకటీగలపాలెం, గుండకమ్మ మధ్యన ఒరిగిన రైల్వే లైన్ గట్టు
- వెంటనే మరమ్మతులు చేసిన కార్మికులు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గుంటూరు - నంద్యాల రైలు మార్గంపై ప్రభావాన్ని చూపించింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా చీకటీగలపాలెం, గుండ్లకమ్మ మధ్యన కొంత భాగం రైల్వేలైన్ గట్టు దెబ్బతింది. ఎత్తైన ప్రదేశంలో మట్టి జారిపోవడంతో ఒక దశలో రైలు పట్టాలు కూడా ఒరిగిపోతాయని భావించారు. దీనిని గుర్తించిన వెంటనే కీ మెన్‌లు, కార్మికులు అధికారులకు నివేదించారు. రైల్వే అధికారుల సూచనలతో ఇసుక బస్తాలు పేర్చి గట్టు మరింత ఒరిగిపోకుండా కాపాడారు. మరోవైపు గుంటూరు - గుంతకల్లు రైల్వే లైన్ రద్దీ మార్గాల్లో ఒకటి కావడంతో రైళ్ల, గూడ్స్ రేక్‌ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. దీంతో ఈ మార్గంలో రళ్ల రద్దు, దారి మళ్లించడం వంటివి అవసరం లేకుండా పోయింది.



చీకటీగలపాలెం - గుండ్లకమ్మ సెక్షన్‌లో ఒరిగిన రైలుమార్గం గట్టుని కాపాడిన కార్మికులు

ఉప్పొంగిన పాతాళగంగ

బొల్లాపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో మండలంలోని గాటి తండాలో రెండు వ్యవసాయ బోర్ల నుంచి పాతాళ గంగ ఉబికి వస్తోంది. తండాకు చెందిన భూక్యా బద్దునాయక్ మిరప చేనులోని ఈ బోర్లలో నిరంతరం పైకి వస్తున్న నీటిని చూసేందుకు.. స్థానికులు అక్కడికి వస్తున్నారు.



గాడితండా వద్ద వ్యవసాయ బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

తీరనున్న క్రీడా ఇక్కట్లు!

- ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్
- గోదాముకు చేరుకున్న క్రీడా పరికరాలు
- పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు

గుంటూరు(విద్య): అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఒక్కో పాఠశాలకు రూ.10 వేల నుంచి రూ. 30 వేల విలువైన సామగ్రి అందజేయనున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు సంబంధించిన క్రీడా పరికరాలు క్లస్టర్ పాఠశాలలకు చేరాయి. గుంటూరు క్లస్టర్‌కు సంబంధించి నగర సమీపంలోని ఏటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల గదుల్లో నిల్వ చేశారు. త్వరలో మండలాల వారీగా స్కూల్స్‌కు పంపిణీ చేయడానికి విద్యాశాఖ ఏర్పాటు చేస్తోంది.

అన్ని ఉన్నా..క్రీడా సామగ్రి లేక..

ఉమ్మడి జిల్లాలో 2000 పైగా ప్రాథమిక, 600 పైగా ప్రాథమికోన్నత, 450 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6.50 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అత్యధిక పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉన్నాయి. జడ్పీ, యూపీ పాఠశాలల్లో నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. కూటమి ప్రభుత్వం క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఆలోచన చేసింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.



బాస్కెట్‌బాల్ శిక్షణలో...



క్రికెట్ సాధన చేస్తున్న విద్యార్థులు

క్రీడా పరికరాల పంపిణీ ఇలా..

ప్రతి పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాల ఇండెంట్లను విద్యాశాఖ సేకరించింది. ఇందులో 67 రకాల బ్రాండ్స్ అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా అవుట్ డోర్ గేమ్స్ క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, ఖో-ఖో పోటీలకు అవసరమైన క్రీడా పరికరాలు, ఇండోర్ గేమ్స్ కు సంబంధించి క్యారమ్స్, చెస్ బోర్డులు అందజేస్తారు. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖరీదు చేసే క్రీడా పరికరాలు అందిస్తారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని డీఈఓ సీవీ రేణుక తెలిపారు. క్రీడా పరికరాలు ఇప్పటికే కొన్ని వచ్చాయని, దశల వారీగా పంపిణీ చేస్తామన్నారు.



మోదేపల్లి సమీపంలో చిలకలేరు ఉధృతికి బ్రిడ్జి సమీపంలో కోసుకుపోయిన రోడ్డు



పేరాయపాలెం సమీపంలో కొట్టుకుపోయిన కొత్తగా నిర్మించిన తాత్కాలిక బ్రిడ్జి

కోసుకుపోయిన రోడ్డు.. కొట్టుకుపోయిన బ్రిడ్జి

అద్దంకికి పలు గ్రామాల నుంచి నిలిచిన రాకపోకలు

అద్దంకి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగిపొర్లటంతో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డులో మోదేపల్లి సమీపంలో చిలకలేరు వాగుపై ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డు భారీగా కోసుకుపోయి పోయింది. గురువారం కూడా చిలకలేరు వాగుకు వరద ఉధృతి కొనసాగింది. పేరాయపాలెం సమీపంలో దోర్నపు వాగు ఉధృతంగా ప్రవహించటంతో ఇటీవల తాత్కాలికంగా నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయింది. మూడేళ్ల క్రితం బ్రిడ్జి కుంగినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత తాత్కాలికంగా బ్రిడ్జి నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జి కూడా కొట్టుకుపోయింది. దీంతో అద్దంకి మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, ఉప్పునేనివారిపాలెంతో పాటు తాళ్లూరు, చీమకుర్తి మండలాల్లోని పలు గ్రామాల నుంచి అద్దంకికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అద్దంకి నుండి తాళ్లూరు, గంగవరం, బొద్దికూరపాడు కు నడిచే బస్సు సర్వీసులు రద్దు అయ్యాయి. మండలంలోని మరికొన్ని రోడ్లు కూడా దెబ్బతిన్నాయి.

మొంథా పోయి.. వరద వచ్చే

అవీఇవీ

(5వ పేజీ తరువాయి)

క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వచ్చి చేరుతోన్న వరద అంచనా లెక్కకు అందడంలేదు. దీంతో అధికారులు శుక్రవారానికి మరింతగా ఉధృతి పెరుగుతుందన్న అంచనాలో ఉన్నారు.

రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గర్లో

ప్రకాశం బ్యారేజికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 11 అడుగల మేర నీటి మట్టం కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నానికే వరద ప్రవాహ స్థాయి 3.9 లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. 5.67 లక్షలకు నీటి విడుదల స్థాయి పెరిగితే గురువారం రాత్రి 2వ ప్రమాద హెచ్చరిక అమల్లోకి వస్తుందనే అంచనాలో నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

లంక గ్రామాల్లో మళ్లీ భయం

లంక గ్రామాలు మరోసారి భయం గుప్పిట్లోకి చేరాయి. గత వరదలకు సంబంధించి ఏర్పడిన నష్టాల నుంచి తేరుకోక ముందే వరద భయం వెంటాడుతోంది. మిగిలిన పంటలు కూడా దక్కవనే ఆవేదనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాలను ఇప్పటికే రెండు దఫాలుగా వరదలు ముంచేశాయి. అరటి మినహా, పసుపు, కంద, మినుము, కూరగాయల సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాని చవి చూశారు. నిన్నటి తుఫాన్ పెనుగాలలకు అరటి చెట్లు కూడా కుదలయ్యారు. పసుపు, కంద వంటి దుంప పంట గత నష్టాలను తట్టుకుని కొద్దిగా అయినా దిగుబడిని రైతుకు దక్కనిస్తాయనుకుంటే వరద భయం మళ్లీ వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. నదిలో వరద ఉధృతి పెరగడంతో మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం రాత్రి కొల్లిపర మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ ను సమర్థంగా ఎదుర్కొన్నామని, వరద విషయంలోనూ భయపడాల్సిన పనిలేదని, దీనిని కూడా అధికమిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

ఫీడర్ కెనాల్‌కు గండ్లు

పొలాలపై ప్రవహించిన వరద

పంటలను కాపాడుకోలేక రైతుల అవస్థలు



యడవల్లి వద్ద తెగిన ఫీడర్ కెనాల్

పెద్దదోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వరద పోటెత్తి ఫీడర్ కాలువకు చేరడంతో కటకానిపల్లె, యడవల్లి వద్ద కాలువకు గండ్లు పడ్డాయి. వరద నీరు పంట పొలాలపై ప్రవహించడంతో మిరప, అరటి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పైర్లు నీటిపాలవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల కష్టం, పెంచిన పైరు మళ్లీ ఎప్పటికి వస్తుందని వాపోతున్నారు. నాలుగు రోజులుగా తిమ్మాపురం, కడపరాజుపల్లె, ఐనముక్కల, పెద్ద బొమ్మలాపురం, కొత్తూరు జమ్మిదోర్నాల, చిన్నగుడిపాడు, చిన్నదోర్నాల, రామచంద్రకోట తదితర గ్రామాల్లో నీటి వరద ప్రవాహం తగ్గలేదు. పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

గుండ్లకమ్మకు తగ్గని వరద ఉధృతి

బయటపడని ఊటబావులు...

అద్దంకి వాసులకు నీటి కష్టాలు...

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నది

అద్దంకి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): అద్దంకి చుట్టూ వరద నీటి ప్రవాహం ఉన్నా.. పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మొంథా తుఫాన్ ప్రభావంతో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది ఎగువ ప్రాంతాలలో వర్షం నీరుతో గురువారం కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అద్దంకి పట్టణానికి మంచినీటి సరఫరా చేసే ఊటబావులు కూడా నీట మునిగాయి. ఈ రెండు ఊటబావుల నుంచే అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్, కాకానిపాలెం ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి పంపింగ్ చేసి 90శాతం పట్టణంలోని కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఊటబావులు నీటమునగగా, అక్కడికి వెళ్లే విద్యుత్‌లైన్ కూడా దెబ్బతింది. అక్కడ విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బంది వరదలో చిక్కుకోవడంతో అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చారు. వరద ఉధృతి గురువారం కూడా కొనసాగడంతో ఊటబావుల నుండి నీటి పంపింగ్ పునరుద్ధరించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు 5 ట్యాంకర్లు ఏర్పాటు చేసి పట్టణంలో పేదలు నివశించే కాలనీలకు సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీరు కొన్ని ప్రాంతాలకు మా త్రమే సరఫరా చేస్తుండడంతో మిగిలిన అన్ని ప్రాంతాల ప్రజలు తాగునీటితో పాటు సాధారణ వినియోగం కోసం కూడా ఇబ్బంది పడుతున్నారు.



7వ వార్డులో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ప్రమాద స్థాయికి గుండ్లకమ్మ ప్రవాహం

సప్లై చానల్‌ను వెడల్పు చేసి నీటి మళ్లింపు

ఊపిరిపీల్చుకున్న ప్రజలు

బేస్తవారపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో కురిసిన వర్షానికి కంభం చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతున్న నేపథ్యంలో బేస్తవారపేటలోని సోమవారపేట వద్ద సీతురేలు కతువకు నీటి ప్రవాహం ప్రమాదస్థాయికి చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయానికి భారీగా వరద పారుతుండడంతో కతువ చానల్ ద్వారా నీరు వెళ్లలేక సమీపంలోని గృహాలు, పంట పొలాల్లోకి చేరింది. దీంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో సప్లై చానల్‌ను వెడల్పు చేసి నీటిని బయటకు పంపడంతో అది మార్కాపురానికి చేరింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. వారితోపాటు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ మల్లికార్జున, తహసీల్దార్ జితేంద్ర, ఇండ్లా శేఖర్‌రెడ్డి ఉన్నారు.

బంగారు గొలుసు అపహరణకు యత్నం

ఎదిరించిన మహిళలు

చైన్‌ను పడవేసి పరారైన దొంగ



గొలుసు లాగిన యువకుడిని అడ్డుకుంటున్న మహిళలు

అద్దంకి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలవకూరు రోడ్డులో వైఎస్ఆర్ అపార్ట్‌మెంట్ ఎదరు చిల్లరకొట్టులోని మహిళ మెడలోని బంగారు గొలుసును దొంగిలించేందుకు యత్నించిన యువకుడిని మహిళలు అడ్డుకున్నారు. స్థానికుల కథనం మేరకు... కలవకూరు రోడ్డులో బడ్డీ దుకాణం వద్దకు గురువారం సాయంత్రం ఒక యువకుడు వెళ్లాడు. దుకాణదారు గురవమ్మను వాటర్ బాటిల్ అడిగాడు. ఇచ్చిన తరువాత మరో బాటిల్ అడగడంతో తీసుకొచ్చేందుకు దుకాణంలోకి వెళ్లింది. ఆ సమయంలో యువకుడు కూడా లోపలకెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసును లాగాడు. ఎదురు ఎదురు తిరిగి ఆ యువకుడిని బయటకు నెట్టింది. ఈ విషయాన్ని గమనించిన సమీపంలో మహిళా బేల్దారి కూలీ వచ్చి దొంగకు చెందిన మోటార్‌సైకిల్ తాళం తీసింది. దీంతో దొంగ దుకాణంలో ఉన్న కత్తి తీసి బెదిరించాడు. దీంతో తాళం ఇచ్చారు. బంగారం గొలుసును అక్కడే పడవేసి దొంగ మోటార్‌సైకిల్‌పై కలవకూరు రోడ్డులో పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

గుండ్లకమ్మ నదిలో దూకిన వృద్ధుడు



విచారిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో దూకి వృద్ధుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన పట్టణంలోని భాగ్యనగర్ 2వ లైనులో చోటుచేసుకొంది. కాలనీకి చెందిన మాచాబత్తిన నాగబ్రహ్మాచారి(63) మానసిక, శారీరక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గురువారం మెడికల్ షాపుకు వెళ్లి మందులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. నేరుగా, గుండ్లకమ్మ నది వద్దకు వెళ్లి దుస్తులు విప్పి నదిలో దూకినట్లు భావిస్తున్నరు. వాహనచోదకులు ఈ విషయాన్ని గమనించి స్థానికులకు చెప్పారు. నాగబ్రహ్మాచారి ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు వెతకడం ప్రారంభించారు. పోలీసులకు విషయం తెలియడంతో సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వంతెనపై ఉన్న చెప్పులు ఆధారంగా నాగబ్రహ్మాచారిగా కుటుంబసభ్యులు గుర్తించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆఖరి మజిలీకి మొంథా దెబ్బ

పెద్ద దోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌తో తాకిడికి మండలం అతలాకుతలమైంది. ఎక్కడ చూసిన వరద, బురదమయంగా మారింది. ఆఖరి మజిలీకి కూడా తుఫాన్ అవస్థలు తప్పలేదు. మండలంలోని ఐనముక్కల గ్రామంలో మృతదేహన్ని స్మశానానికి తరలించేందుకు బంధువులు బురదలో నానాఅగచాట్లు పడ్డారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందాలి

అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి



బూదవాడలో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. గురువారం మండలంలోని బూదవాడ, కోటపాడు, కొండమూరు గ్రామాలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న, మిరప, పత్తి పంటలను మంత్రి.. రైతులు, అధికారులతో కలసి పరిశీలించారు. పంట నష్టం ప్రాథమిక నివేదిక, ఈ క్రాప్ నమోదు గురించి వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మంత్రికి వివరించారు. దెబ్బతిన్న పంటల పరిశీలన సమయంలో ఆ సమాచారాన్ని సంబంధిత రైతులకు ముందుగా తెలియజేయాలన్నారు. నష్టపోయిన పంటల నమోదు విషయంలో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. ఈ క్రాప్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. అధిక వర్షంతో మినుము పూర్తిగా దెబ్బతిందని, మిరప ఉరకెత్తే పరిస్థితి ఉందని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. బూదవాడ గ్రామంలో ధనలక్ష్మీ కాలనీలో నివాసగృహాల మధ్య నిలిచిన నీటిని పరిశీలించారు. కోటపాడు ఉన్నత పాఠశాలలో కూలిన ప్రహరీని పరిశీలించి పునర్నిర్మాణానికి తగిన అంచనాలు వెంటనే తయారు చేయాలని ఏఈ హనుమంతరావును ఆదేశించారు. కొండమూరు గ్రామంలో పంటలను పరిశీలించిన మంత్రి ఆ తర్వాత ఒరిగిఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని ఈఈ మస్తానరావును ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఏడీఈ దామోదరం, మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల సంగరకొండ, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, అలవల రామిరెడ్డి, బత్తుల వెంకటరావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతల సహదేవుడు, సుబ్బారెడ్డి, ఆదిరెడ్డి, గడ్డం నాగేశ్వరరావు, కాటా అంజయ్య, చిలుకూరి వెంకటేశ్వర్లు, మురకొండ సుబ్బారావు, కాజా, ఉన్నం రవి, వినయ్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో కన్నీళ్ల వెతలు

కనీస వసతులు కల్పించకుండానే నివేశన స్థలాల కేటాయింపు

ఒత్తిడి చేసి మరీ ఇళ్ల నిర్మాణాలు

నేటికీ వసతులు లేక పేదల అవస్థలు



బొమ్మనంపాడురోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో రోడ్లపై నిలిచి ఉన్న నీరు

అద్దంకి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నేతల నిర్లక్ష్యపు పాపం నేడు పేదలకు శాపంగా మారింది. 'జగనన్న' పేరుతో కాలనీని ఏర్పాటు చేసినా కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. అయినప్పటికీ, నాటి వైసీపీ పాలకులు వీటిని కాలనీలు కాదని, కొత్త ఊళ్లని ఊదరగొట్టారు. తీరా ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఆ కాలనీలు నివాసయోగ్యం కాని చిట్టడవులుగా మారాయి.

వైసీపీ నేతల డాంబికాలు నమ్మి...

అద్దంకి పట్టణంలోని సుమారు రెండు వేల మంది లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వంలో మూడు చోట్ల కాలనీలు ఏర్పాటు చేశారు. అధికారులు, పాలకుల ఒత్తిడితో ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు తోడు లక్షల రూపాయలు సొంత డబ్బులు ఖర్చు చేసి ఇళ్ల నిర్మించుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనాటికీ, ఆయా కాలనీలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని నాడు నేతలు గొప్పలు చెప్పారు. ఎలాంటి మౌలిక వసతులు కల్పన చేపట్టకుండానే లబ్ధిదారులపై ఒత్తిడి చేసి గృహ ప్రవేశాలు చేయించారు. గత్యంతరం లేక పలువురు నివాసం ఉంటున్నారు. రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, మంచి నీటి వసతులు కల్పించలేదు.



అంతర్గత రోడ్లు లేక నిలిచిన వర్షం నీరు

చిట్టడవులను తలపిస్తున్న కాలనీ

బొమ్మనంపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ అద్దంకి పట్టణానికి సుమారు 4 కి.మీ దూరంలో ఉంది. కనీస రవాణా వసతి కూడా లేదు. అక్కడ వెయ్యి మందికి స్థలాలు కేటాయించగా ప్రస్తుతం పదుల సంఖ్యలోనే నివాసం ఉంటున్నారు. అదే సమయంలో పెద్ద ఎత్తున చిల్లచెట్లు పెరిగి ప్రస్తుతం కాలనీ చిట్టడవిని తలపిస్తోంది. కాలనీకి వెళ్లే బొమ్మనంపాడు రోడ్డులో చినుకుపడితే వాహనాలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్లలో ఏర్పాటు చేసిన కాలనీలలో ఎక్కువ మంది లబ్ధిదారులు నివాసాలు ఉంటున్నా, వసతుల కల్పన మాత్రం జరగలేదు. దీంతో వర్షం కురిసినా ప్రతిసారి రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కనీస వసతులు లేకపోవడంతో పలువురు ఇళ్లను వదిలేసి అద్దంకి పట్టణంలో ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆయా కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ఇంకా దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లిలో పర్యటన



బింగినపల్లి చెరువుకట్టను పరిశీలిస్తున్న దామచర్ల సత్య

సింగరాయకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య భరోసా కల్పించారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాల్లో ఆయన గురువారం టీడీపీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత బింగినపల్లి పంట చెరువును పరిశీలించారు. ప్రమాదహేతువుగా ఉన్న రింగ్‌బండ్‌ను పటిష్టం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బేసిన్‌పల్లెపాలెం, దేవళంపల్లెపాలెం, బావివద్దపల్లెపాలెంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించి క్లోరినేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు. తదనంతరం పాకల పోతయ్యగారిపట్టపుపాలెం, క్రాంతినగర్, పాకల బీచ్‌లో పర్యటించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వేటకు వెళ్లని మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. సోమరాజుపల్లి పంచాయతీలోని గిరిజనకాలనీ అప్పాపురం పర్యటించి గిరిజనుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌బీవీ రాజేష్, పలుశాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనపై అధికారుల దృష్టి

వేటపాలెం(చీరాల), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో నీటమునిగిన గ్రామాలపై అధికారులు దృష్టి సారించారు. ఈక్రమంలోనే వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెంలో వర్షం నీరు భారీగా చేరడంతో గ్రామంలో నుంచి నీటిని తొలగించేందుకు ఎంపీడీవో రాజేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, వేటపాలెం ఎస్సై జనార్ధన్ చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువ తవ్వించి నీటిని తొలగించారు. వారి వెంట పంచాయతీ అధికారులు ఉన్నారు.

నామ్ రోడ్డుపై వాహనాలు ఉంచితే చర్యలు

అద్దంకి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డుపై వాహనాలు నిలిపి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని పోతురాజుగండి వద్ద పలు దుకాణాల ముందు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి ఉంచడంతో గురువారం సీఐ సుబ్బరాజు పరిశీలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పలువురు వాహనచోదకులకు అపరాధ రుసుము విధించారు. మరికొన్ని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



నామ్ రోడ్డుపై ఉంచిన ద్విచక్రవాహనచోదకులకు, దుకాణాల యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు

అవీ..ఇవీ..

చెక్‌డ్యాంలను పరిశీలించిన వాటర్‌షెడ్ బృందం



చెక్‌డ్యాంలను పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ సింగయ్య, బృందం

పంగులూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కెళ్లపాడు, కొండమూరు గ్రామాలలో 2009-10 ఆర్థిక సంవత్సరంలో వాటర్‌షెడ్ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన చెక్‌డ్యాంలు, చెక్‌వాల్స్, చిన్న ఊటకుంటలను వాటర్‌షెడ్ శిక్షణ సిబ్బంది గురువారం పరిశీలించారు. ఎన్‌ఐఆర్‌డీ ద్వారా ఈటీసీ బాపట్ల కేంద్రానికి వచ్చిన వాటర్‌షెడ్ శిక్షణ సిబ్బంది క్షేత్రపర్యటనకు వచ్చిన సిబ్బంది స్థానిక రైతులతో మాట్లాడారు. చెక్‌డ్యాంల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. డ్వామా ఏపీడీ బత్తిన సింగయ్య నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఏపీవో సంతోషం, డ్వామా సిబ్బందితో పాటు ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీవోగా కోటయ్య బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా గురువారం డి.కోటయ్యనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జ్ ఏపీవో రమాదేవిని జిల్లా అధికారులు పనులలో అవకతవకలపై సస్పెండ్ చేశారు. బాపట్ల జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న కోటయ్య నాయక్‌ను బల్లికురవకు పీడీ విజయలక్ష్మీ నియమించారు. నూతన ఏపీవో కోటయ్యనాయక్ ఎంపీడీవో కుసుమకుమారిని కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. జాబుకార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ, ఈ కేవైసీని వెంటనే పూర్తి చేయాలన్నారు. పనులలో ఎక్కడ లోపాలు ఉన్నా, కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ఈసందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికే బల్లికురవ మండలంలో పనిచేస్తున్న అయిదుగురు ఉపాధి సిబ్బందిని ఇద్దరు క్షేత్ర సహాయకులను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో పని చేయాలని ఆమె కోరారు.

విద్యార్థుల్లోని పదునైన ఆలోచనలు చరిత్రను సృష్టిస్తాయి..

● నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రస్తోగి



అవార్డు ఆవిష్కరణలో పాల్గొన్న ప్రతినిధులు

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థుల లోని పదునైన ఆలోచన లు చరిత్రను లిఖిస్తాయని నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా.అమిత్ రస్తోగి అన్నారు. 'చీరాల గీతా యంగ్ సైంటిస్ట్ ఆవిష్కార్ అవార్డ్ - 2025' కార్యక్రమం గురువారం న్యూఢిల్లీ పితాంపురలో నిర్వహించారు. ఆంధ్ర, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు చెందిన 25 మంది విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రం అందజేశారు. 2022 నుంచి సుమారు 100 మంది విద్యార్థులతో రూపొందించిన ఆవిష్కరణలు దేశానికి అందించినట్లు ప్రోగ్రామ్ చైర్మన్ వలివేటి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వీరాంజనేయులు

అద్దంకి ,అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి):శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి పంగులూరు మండలం భగవాన్ రాజుపాలేనికి చెందిన రావిపాటి వీరాంజనేయులు, పద్మావతి దంపతులు, కుటుంబసభ్యులు గురువారం రూ.1,01,116లను ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను పూజారులు ఆశీర్వదించారు.









కొత్తపాలెం కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, చేనేత కాలనీలో నీటిలో నిలబడిన కుటుంబం, కోతపడ్డ పర్చూరు- కారంచేడు రహదారి, కడవకుదురులో రైతులతో మాట్లాడుతున్న ఏలూరి

అతలాకుతలం

- నీట మునిగిన పంట పొలాలు
- తగ్గని ఉధృతి.. పొంగి పొర్లుతున్న వాగులు
- కొనసాగుతున్న సహాయ కార్యక్రమాలు
- నష్టాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను చీరాల నియోజకవర్గ ప్రజలను పూర్తిగా ముంచేసింది. పంటపొలాలు సైతం మోకాళ్ల లోతు నీటిలో ఉన్నాయి. అలాగే చేనేత కార్మికుల మగ్గాలు సైతం నీళ్లల్లోనే ఉన్నాయి. ఇప్పుడిప్పుడే విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. నియోజకవర్గంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటనష్టాలపై అంచనాలు వేస్తున్నారు. వాడరేవు - రామాపురం మార్గంలో వంతెనల కూల్చివేత పరంపర కొనసాగుతుంది. ఇప్పటికే రెండు వంతెనలు పూర్తిగా కూలాయి. ఒక చప్టా అధ్వానంగా మారి రాకపోకలు నిలిచింది. అయితే గురువారం రామాపురం వద్ద మిగిలి ఉన్న చివరి వంతెన కూడా కూలిపోయింది. ఉదయం నుండే ఎమ్మెల్యే కొండయ్య అధికారులతో కలిసి ముందుగా రామకృష్ణాపురంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అలాగే వేటపాలెం మండలం కొత్తపాలెం లిఫ్టిరిగేషన్‌ను పరిశీలించారు. అడ్డంగా నిలిచిన గుర్రపు డెక్కను అధికారులకు సూచనలు చేసి తొలగించి వర్షపు నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఇంకా కొన్నిచోట్ల పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే సాధారణ స్థితికి చేరేందుకు కొంత సమయం పడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

చినగంజాం : మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అప్పేరు, కొమ్మమూరు కాలువలకు భారీగా వరద వచ్చింది. దీంతో గొనసపూడి, కడవకుదురు, చింతగుంపల్లె ప్రాంతాల్లో వేసిన వరి పైరు పూర్తిగా నీట మునిగింది. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. గొనసపూడి ప్రాంతంలోని పూర్ణ భాస్కర్ లిఫ్ట్‌ఇరిగేషన్ కింద 125 ఎకరాలలో సాగు చేస్తున్న వరి పైరు మూడు రోజులుగా వరదనీటిలో ఉండి పంట దెబ్బ తిందని రైతులు తెలిపారు. ఇప్పటికి వరకు పంటసాగుకు రూ.20వేలు ఖర్చుచేసినట్లు వివరించారు. పంట పొలాలను వరద ముంచెత్తడంతో పెట్టిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరులా అయిందని రైతులు కేశన వెంకట్రావు, పొద రామాంజనేయులు, నక్కల సోమయ్య, తోటకూర హరిబాబు, వసంతరావలు ఆవేదన వ్యక్తం చేశారు. నీలాయపాలెం ప్రాంతంలో 320 ఎకరాల్లో పోసిన వరినార్లు, 90 ఎకరాల్లో ఎదపెట్టిన వరి పంట నాగన్నవాగు వరదనీటికి పైర్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు నీలాయపాలెం రైతులు తెలిపారు. కొమ్మమూరు కాలువకు 15 గండ్లు పడినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ఎ.శ్రీధర్ తెలిపారు. పెదగంజాం గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద నుంచి ఎన్టీఆర్ వారిధి వరకు రహదారిపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ముందుజాగ్రత్తగా రాకపోకలు నిలిపివేసినట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు.

●పర్చూరులో పర్యటించిన మంత్రులు

పర్చూరు : తుపాను ప్రభావంతో కకావికలమైన పర్చూరు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించటానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి గురువారం వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించారు. వరద తీవ్రత అధికంగా ఉన్న పర్చూరు, కారంచేడులో మంత్రులు విస్తృతంగా పర్యటించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

● రైతుల సమస్యలపై స్పందన

మంత్రుల పర్యటన సందర్భంగా అన్నంబొట్లవారిపాలెం రైతులు తమ గ్రామానికి కలిపే వంతెన నిర్మాణం అత్యవసరమని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చర్చించారు. అదేవిధంగా పర్చూరు సబ్‌స్టేషన్ వద్ద డ్రైనేజ్ పైపులు ఏర్పాటు చేయాలని రైతుల వినతిని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

● అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లకు కొత్త ప్రణాళిక

వాడరేవు - పిడుగురాళ్ల హైవేపై రెండు అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రులు సూచించారు. నాగులపాలెం - కారంచేడు హైవే వద్ద సర్వీస్ రోడ్లలో అవసరమైన చోట వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదన రూపొందించాలన్నారు. అదేవిధంగా కేడబ్ల్యూడీ యూటీ(కెడబ్ల్యుడికే) నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక తుపాను ప్రభావం తగ్గిన వెనువెంటనే పొగాకు కొనుగోళ్ల ప్రారంభిస్తామన్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం: మంత్రి రవికుమార్

వరదల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రైతుల కష్టాలకు తగిన పరిహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.

సహాయక చర్యలు వేగవంతం : ఎమ్మెల్యే

అధికారులు సమన్వయంతో పనిచేసి సహాయ చర్యలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశించారు. వరద వల్ల ముంపు వాటిల్లిన గ్రామాల్లో నిల్వ నీటిని తొలగించడానికి డ్రైనేజీ పనులను తక్షణం చేపట్టాలన్నారు. అదేవిధంగా తాగునీరు, రవాణా పునరుద్ధరించాలన్నారు.

● వరదనీరు తొలగింపునకు చర్యలు

వేటపాలెం(చీరాల) : మండలంలోని చల్లారెడ్డిపాలెంలో వర్షం నీరు భారీగా చేరింది. దీంతో గ్రామం నుండి నీటిని తొలగించేందుకు ఎంపీడీవో రాజేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, వేటపాలెం ఎస్సై జనార్థన్ చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో డ్రయినేజీ ఏర్పాటు చేసి నీటిని తొలగించారు. వారివెంట పంచాయతీ అధికారులు ఉన్నారు.

వరదప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

చినగంజాం : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన చినగంజాం, ఇంకొల్లు మండలాల్లో పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నివేదికలను త్వరిత గతిన రూపొందించాలని చీరాల ఏడీఏ రత్న కుమారికి సూచించారు. కడవకుదురు, చింతగుంపల్లె, గొనసపూడి, భీమవరం ప్రాంతాల్లో నీటమునిగిన వరి పంటలను ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా పరిశీలించారు. కడవకుదరు గ్రామానికి చెందిన షేక్ జిలానికి చెందిన కోళ్లఫాంలో వరదనీరు వచ్చి కోళ్ల మృతి చెందడంతో వాటిని పరిశీలించారు.. గ్రామ పరిధిలో 6.14 ఎకరాల తోపుపోరంబోకు భూమి విషయం దొడ్డక బాలకృష్ణ రామకృష్ణలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. ఆ భూమిని పోరంబోకు భూమిగా మార్చి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు సూచించారు. తుపాను నేపథ్యంలో ఆర్‌బీ.ఛానల్‌కు పడిన గండ్లు వెంటనే పూడ్చాలని డీఈ ప్రసాద్‌ను ఆదేశించారు. రొంపేరు వరదనీరు గ్రామంలోనికి రాకుండా షట్టర్లు ఏర్పాటు చేయాలని డ్రైనేజీ డీఈ డి.సుబ్బారావును ఆదేశించారు. గొనసపూడి కొమ్మమూరు కాలువ నుండి అప్పేరు వాగుకు లాకులు ఏర్పాటు చేయాలని, గొనసపూడి ప్రాంతంలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లను పూడ్చాలని ఆదేశించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తోటకూర సత్యనారాయణ విషయం ఆయన తెలుసుకొని సత్యనారాయణ నాయనమ్మ శేషమ్మకు ఆర్థిక సాయం అందించారు. ఇంకొల్లు మండలంలోని కొణికి వద్ద కొత్త వరద పరిస్థితిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దుద్దుకూరు గ్రామంలో లోలెవల్ వంతెనను పరిశీలించారు. వరదలకు కూలిన వందేళ్ల నాటి రావి చెట్టును పరిశీలించారు. అనంతరం ఊరచెరువు గండిని పరిశీలించి తక్షణమే కట్టవేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారులు.. స్తంభించిన రాకపోకలు

పర్చూరు/కారంచేడు : పర్చూరు కారంచేడు మండలాల్లో వరద విలయతాండవం చేస్తోంది. వాగులు, వంకలు కాలువలు పొంగి పొరలుతుండడంతో వేల ఎకరాల్లో సాగుచేసుకున్న పైర్లు జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల వరద నీటికి రోడ్లు దెబ్బతిని రాకపోకలు స్తంభిచాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు, కారంచేడుకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనికి తోడు కారంచేడు నుంచి వాడరేవు వెళ్లే వాగుకు గండి పడడంతో పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి.

కొణిదెనరోడ్డులో గుంతల పూడ్చివేత

మార్టూరు : భారీ వర్షాలు కారణంగా మార్టూరు గ్రామంలో కొణిదెన రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వాస్తవంగా గతంలో ఏర్పడిన గుంతలు ఈ తుఫాను కారణంగా మరింత విస్తరించాయి. మార్టూరు నుంచి ఈ రోడ్డు మీదుగా గొట్టిపాటి నగర్, డక్కలి కాలనీ, విజయనగర్ కాలనీవాసులు, రాజుపాలెం, కొణిదెనవాసులు రోజూ ప్రయాణిస్తుంటారు. గోతులు పెరగడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉండడంతో గురువారం మార్టూరు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు ఎర్ర గ్రావెల్‌ను ట్రాక్టర్లపై తెప్పించి, గోతులను పూడ్చివేశారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని చదును చేయించగా, తాత్కాలికంగా వాహనదారులకు గుంతలు సమస్య తీరింది.

నర్సరీలో నీటమునిగిన మొక్కలు

అద్దంకి : మండలంలోని రామాయపాలెంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీలోకి వరద నీరు చేరి గురువారానికి కూడా బయటకు వెళ్లలేదు. దీంతో నర్సరీలో ప్రస్తుతం ఉన్న 20 వేల మొక్కలు పూర్తిగా కుళ్లిపోయే ప్రమాదం ఉంది. నీటి లో మునిగిన నర్సరీని గురువారం అటవీశాఖ కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. రాజశేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.









పుల్లయపాలెంలో నీటమునిగిన వరి, ఇంకొల్లు కడవకుదురు సమీపంలో కొమ్మమూరు కాలువకు పడిన గండి, కొణిదెన దారిలో గుంతలు పూడుస్తున్న ఎక్స్‌కవేటర్, పర్చూరులో పర్యటిస్తున్న మంత్రి రవికుమార్

భక్తిశ్రద్ధలతో కోటిసోమవారం



వేయిస్తంభాల గుడిలో భక్తుల పూజలు

అద్దంకి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అత్యంత పవిత్రంగా భావించే కోటి సోమవారాన్ని గురువారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.



పాతశివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

పట్టణంలోని వేయిస్తంభాల గుడి, పాత శివాలయం, కమలేశ్వరాలయం, మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

● వైసీపీ సమన్వయకర్త అశోక్‌కుమార్



మొక్కజొన్నను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

అద్దంకి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులు వెంటనే పరిహారం ఇవ్వాలని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని కొటికల పూడి, కుంకుపాడు గ్రామాలలో దెబ్బతిన్న పంటలను గురువారం అశోక్‌కుమార్ పరిశీ లించారు. వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, జ్యోతి హనుమంతరావు తదితరులు ఉన్నారు.

● వేటపాలెం(చీరాల) : తుపాను బారిన పడిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ నేతలు బీరక సురేంద్ర, కావూరి రమణారెడ్డి అన్నారు. గురువారం వేటపాలెం మండలంలో దేశాయిపేట, విఘ్నేశ్వరకాలనీ, న్యూ.కెపాల్, జగనన్న కాలనీల్లో సురేంద్ర, చీరాల మండలం చీరాల నగర్, కొత్తపాలెం, విజయనగర్ కాలనీ, ఈపూరుపాలెం, బోయినవారిపాలెం ప్రాంతాల్లో రమణారెడ్డి వరద ప్రభావాన్ని పరిశీలించారు. తుపాను కారణంగా రైతులు, చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని వెంటనే వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పంటనష్టం వివరాల నమోదు

మార్టూరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను అధికారులు లెక్కిస్తున్నారు. దీనిలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం శాస్త్రవేత్తలు మండలంలోని ద్రోణాదుల, బొబ్బేపల్లి గ్రామాలలో దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించారు .ద్రోణాదుల గ్రామంలో 300 ఎకరాల మినుము పంట దెబ్బతిన్నట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలకు మండలంలో దెబ్బతిన్న పంటల గురించి ఏవో రామినేని లావణ్య వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ మరిత, డాట్ సెంటర్ సమన్వయకర్త అచ్యుతరాజు, ఎంటమాలజిస్ట్ డాక్టర్ వి అనిల్‌కుమార్ లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైతులతో ఏవో లావణ్య మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల ద్వారా పంట నష్టం వివరాలను సేకరిస్తున్నామన్నారు. పంటనష్టం 33 శాతం కంటే ఎక్కువ ఉంటే రైతుల పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కుమారస్వామి

తుఫాను కారణంగా మండలంలో ఉద్యాన పంటలు మిరప, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో గురువారం మండలంలోని జొన్నతాళి గ్రామంలో దెబ్బతిన్న మిరప పంటను రైతులతో కలిసి ఉద్యానశాఖ అధికారి బి.హనుమంత్‌నాయక్ పరిశీలించారు. వర్షపునీరును పొలం నుంచి 48 గంటలలో బయటకు పంపించే ఏర్పాట్లును చేసుకోవాలని సూచించారు.

బల్లికురవ: మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మార్టూరు ఉద్యానవన అధికారి హనుమంత్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ముక్తేశ్వరం, నక్కబొక్కలపాడు గ్రామాలలో భారీ వర్షాలతో దెబ్బతిన్న కూరగాయల పంటలను ఉల్లి పంటను అయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పాయి, అరటి తోటలు సాగు చేసిన రైతులు చెట్టు మొదులు వద్ద మట్టిని నింపాలన్నారు. అలానే పత్తి, మొక్కజొన్న పైర్లను ఏవో శ్రీనివాసరావు పలు గ్రామాలలో పరిశీలించారు. ముందస్తుగా జిల్లాకు ప్రాథమిక అంచనాలను తయారు చేసి పంపామని పొలాల్లో నీరు తగ్గగానే పరిశీలించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తామన్నారు.

అద్దంకి : పంటపొలాలలో నిలిచిన వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించాలని వ్యవశాయశాఖ ఏడీఏ ఎప్రాయం అన్నారు. మండలంలోని అద్దంకి, కలవకూరు, శంఖవరప్పాడు,. ధర్మవరం గ్రామాలలో దెబ్బతిన్న పొలాలను ఏవో క్రొత్రపాటి వెంకటకృష్ణతో కలిసి పరిశీలించారు. మొక్కజొన్న కోత దశలో ఉన్నందున నీరు బయటకు పంపాలన్నారు. వరికి 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలన్నారు. మినుము పూర్తిగా దెబ్బతిన్నందున నష్టాన్ని లెక్కించాలన్నారు. రైతులు వెంటనే పంట నష్టం వివరాలను సిబ్బందికి తెలియజేయాలన్నారు.



ద్రోణాదులలో మినుమును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పంటనష్టం వివరాలను కేంద్రానికి అందజేస్తా

పంగులూరు : తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల పరిస్థితిని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తానని కిసాన్ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గురుపాటి కుమారస్వామి అన్నారు. కొండమూరులో తుపాను కారణంగా దెబ్బతిన్న మినుము పైరును స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ మండల రామ కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాగర్లమూడి యలమందరావు, మంగమేరి సురేష్, కొల్లికోటేశ్వరరావు, అంజిరెడ్డి, కోటిరెడ్డి, నారపరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.